
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
సిద్దిపేట 5
గురువారం 23 మే 2024



పిడుగుపాటుతో
జాగ్రత్త..!
● రైతులు, వ్యవసాయ కూలీలు అప్రమత్తంగా ఉండాలి
6 లో

వారు నాటారు.. వీరు నరికారు..!

● విద్యుత్ వైర్ల కింద హరితహారం మొక్కలు ● తీగలకు తగులుతున్నాయని కొట్టివేత ● సమన్వయలోపం అంటున్న స్థానికులు


చెట్లకొమ్మలను తొలగిస్తున్న విద్యుత్ సిబ్బంది

సిద్దిపేట రూరల్, మే 22 : గత ప్రభుత్వం పచ్చదనాన్ని పెంపొందించేందుకు కోట్లాది రూపాయలను వెచ్చించి హరితహారం కార్యక్రమాన్ని ప్రతిష్ఠాత్మకంగా చేపట్టింది. అయితే, అధికారుల అవగాహన లోపం వల్ల ఆ లక్ష్యం నీరుగారిపోతుంది. ఫలితంగా మొక్కలు, చెట్లు గొడ్డలి వేటుకు బలవుతున్నాయి.

సిద్దిపేట జిల్లా కేంద్రం నుంచి సిద్దిపేటరూరల్, నారాయణరావుపేట మండలాల్లోని గ్రామాలకు విద్యుత్ సరఫరా కోసం ఏర్పాటు చేసిన 33 కేవీ విద్యుత్ వైరు లైన్ల కింద హరితహారం మొక్కలు నాటడంతో అవి పెరిగి కొమ్మలు తీగలకు తగులుతున్నాయి. దీంతో గాలి వీచిన ప్రతిసారీ విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుంది. సిద్దిపేట రూరల్ మండలం రాఘవాపూర్, పెద్దలింగారెడ్డిపల్లి, బచ్చాయిపల్లి, చింతమడక, సీతారాంపల్లి, నారాయణరావుపేట మండల కేంద్రంతో పాటు సిరిసిల్ల-సిద్దిపేట రోడ్డులోనూ అదే పరిస్థితి. అయితే, విద్యుత్ సరఫరాలో అంతరాయం కలగొద్దనే ఉద్దేశంతో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు చెట్లను, కొమ్మలను తొలగిస్తుండడంతో హరితహారం లక్ష్యం నీరుగారడంతో పాటు ప్రజాధనం వృథా అవుతుందన్న అభిప్రాయం వ్యక్తమవుతున్నది. ఇకనైనా మొక్కలు నాటే సమయంలో ముందుజాగ్రత్త చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

మెరుగైన విద్యుత్‌ను అందించేందుకే..

హరితహారం మొక్కలను విద్యుత్ వైర్ల కింద నాటడం వల్ల చిన్నపాటి వర్షం వచ్చినా, గాలి వీచినా విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుంది. వినియోగదారులకు మెరుగైన విద్యుత్‌ను అందించేందుకు కొమ్మలను తొలగిస్తున్నాం. వచ్చేది వర్షాకాలం కావడంతో ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాం.

- శ్రీనివాస్, విద్యుత్ శాఖ ఏడీఈ




విద్యుత్ వైర్ల కింద తొలగించిన హరితహారం చెట్లకొమ్మలు


చిన్నకోడూరు కొనుగోలు కేంద్రంలో రైతులతో మాట్లాడుతున్న మాజీ మంత్రి హరీశ్‌రావు

రైతులకు కాంగ్రెస్ మొండిచేయి

● బోనస్ ఇస్తామని బోగస్ మాటలు ● అన్ని రకాల పంటలకు బోనస్ ఇవ్వాలి
● మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు

చిన్నకోడూరు, మే 22 : రైతులు పండించిన అన్నిపంటలకు రూ.500 బోనస్ ఇస్తామని కాంగ్రెస్ బోగస్ మాటలు చెప్పి చేతి గుర్తుకు ఓటు వేయమని ఇప్పుడు మొండిచేయి చూపిందని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు అన్నారు. చిన్నకోడూరు మండల కేంద్రంలో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాన్ని బుధవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా కేంద్రంలోని సమస్యలను రైతులను, నిర్వాహకులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో హరీశ్‌రావు మాట్లాడారు. ఆరుగాలం కష్టపడి పండించిన పంటను రైతులు అమ్ముకోవడానికి రోజుల తరబడి కొనుగోలు కేంద్రాల్లోనే పడిగాపులు కాయాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం తడిసిన వడ్లను కొనుగోలు చేస్తున్నామని చెబుతుందని, బాధ్యత కలెక్టర్లదేనని క్యాబినెట్‌లో నిర్ణయాలు ప్రకటిస్తూ హైదరాబాద్‌లోనే మాటలు చెబుతున్నారు. క్షేత్రస్థాయిలో పంట కొనే పరిస్థితిలేదని ఆయన తెలిపారు. ఇప్పటికే అకాల వర్షాలకు కొనుగోలు కేంద్రాల్లో తడిసిన ధాన్యం మొలకెత్తిందన్నారు. తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేస్తామని ప్రభుత్వం చెబుతున్నా.. అధికారులు కేంద్రాలను సందర్శించడం లేదని ఆయన పేర్కొన్నారు. మిల్లర్లు కూడా తేమ, తరుగు పేరిట ఇబ్బందులకు గురిచేస్తున్నారన్నారు. ప్రభుత్వం వెంటనే మొలకెత్తిన, తడిసిన వడ్లను కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. 40 శాతం ధాన్యం కొనుగోలు కేంద్రాల్లోనే ఉందని, మళ్లీ వర్షాలు కురిస్తే రైతులు ఇబ్బందులు పడతారన్నారు. అన్నిరకాల పంటలకు బోనస్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. సిద్దిపేట జిల్లాలో 3,38,389 ఎకరాల్లో రైతులు యాసంగిలో వరి సాగుచేశారని, ఇందులో దొడ్డురకం 3,21,469 ఎకరాల్లో, సన్న రకం 16,920ఎకరాల్లో సాగు చేశారని తెలిపారు. రాష్ట్రంలో జనుము, జీలుగ విత్తనాలు అందుబాటులో లేక రైతులు ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఈ పరిస్థితి లేదన్నారు. గతంలో కాంగ్రెస్ ప్రభుత్వం హయాంలో ఎరువుల బస్తాల కోసం రైతులు చెప్పులు లైన్‌లో పెట్టారని మళ్లీ ఇప్పుడు పచ్చిరొట్ట విత్తనాల కోసం పాస్‌బుక్‌లు లైన్‌లో పెట్టి రోజుల తరబడి ఎదురు చూడాల్సిన పరిస్థితి వచ్చిందని విమర్శించారు. వ్యవసాయ పనులు ప్రారంభం కాకముందే జూన్‌లోనే ఎకరాకు రూ.7,500 పెట్టుబడి సాయం (రైతు భరోసా) రైతుల ఖతాలో వేయాలని హరీశ్‌రావు పేర్కొన్నారు. పచ్చిరొట్ట విత్తనాలను అన్ని ఆగ్రోస్ రైతు సేవాకేంద్రాల్లో, ప్యాక్స్ సెంటర్లలో రైతులకు అందుబాటులో ఉంచాలని డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో మంత్రులు కల్లాల్లో తిరిగే వారని, ఇప్పుడు ఒక్క మంత్రి కూడా ధాన్యం కొనుగోలు కేంద్రాలను సందర్శించడం లేదన్నారు. క్షేత్రస్థాయిలో ఏం జరుగుతుందన్న విషయం తెలుసుకోవడానికి మంత్రులు కొనుగోలు కేంద్రాలను సందర్శించాలన్నారు. అనంతరం చిన్నకోడూరులో బీరప్ప, మాచాపూర్‌లో స్వామి ఆలయ వార్షికోత్సవాల్లో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఆయన వెంట బీఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి రాధాకృష్ణ శర్మ, ఎంపీపీ మాణిక్యరెడ్డి, మండలాధ్యక్షుడు శ్రీనివాస్, వైస్ ఎంపీపీ పాపయ్య, పీఏసీఎస్ చైర్మన్లు సదానందం, కనకరాజు, ఆయా గ్రామాల ఎంపీటీసీలు, మాజీ సర్పంచ్‌లు, బీఆర్ఎస్ నాయకులు పలువురు ఉన్నారు.

అంతా మా ఇష్టం..!

● రియల్టర్ల రాజ్యం.. అనుమతులతో పనేలేదు
● గ్రామీణ ప్రాంతాలలో పుట్టగొడుగుల్లా అక్రమ వెంచర్లు
● స్థానిక నేతల అండదండలు! ● చోద్యం చూస్తున్న అధికారులు
● నిబంధనలు పాటిస్తే ప్రభుత్వానికి ఆదాయం



సిద్దిపేటఅర్బన్, మే 22: తెలంగాణ ఏర్పడిన తర్వాత భూముల ధరలకు అమాంతం రెక్కలొచ్చాయి. దీంతో వెంచర్ల ఏర్పాటుకు అడ్డూఅదుపు లేకుండాపోయింది. సిద్దిపేటలోనూ నాటి నుంచి రియల్ ఎస్టేట్ వ్యాపారం మూడు పువ్వులు ఆరు కాయలుగా కొనసాగుతున్నది. ఇదే అదునుగా భావించిన కొందరు రియల్టర్లు అనుమతులతో పని లేదు.. నిబంధనలు పాటించాల్సిన అవసరమూ లేదు. స్థానిక నేతల అండదండలు ఉంటే చాలు వ్యవసాయ భూమిని వెంచర్‌గా మార్చేయొచ్చు అన్న ధీమాతో వ్యవహరిస్తున్నారు. జిల్లా పరిధిలోని అన్ని మండల కేంద్రాలలో ఇదే తంతు కొనసాగుతోంది. సిద్దిపేట పట్టణానికి కూతవేటు దూరంలో ఉన్న గ్రామాల్లో విలువైన భూములను కొనుగోలు చేసి ఎటువంటి అనుమతులు లేకుండా వాటిని వెంచర్లుగా మారుస్తున్నారు. ప్రభుత్వ అనుమతులు లేకుండానే వాటిని ప్లాట్లుగా మార్చి విక్రయిస్తున్నారు.

ఇవీ.. నిబంధనలు

ప్రభుత్వ నిబంధనల ప్రకారం లేఅవుట్ ఏర్పాటుచేసి విక్రయించుకోవాలనుకుంటే ముందుగా వ్యవసాయభూమిని తహసీల్దార్ కార్యాలయంలో దరఖాస్తు చేసుకుని వ్యవసాయేతర భూమిగా మార్చుకోవాలి. ఓనర్ ఒరిజనల్ డాక్యుమెంట్స్‌తో లేఅవుట్ కు సంబంధించిన బ్లూ ప్రింట్‌తో దరఖాస్తు చేసుకోవాలి. రెవెన్యూ విలేజ్ మ్యాప్ మాస్టర్ ప్లాన్ అందించాలి. రిజిస్ట్రేషన్ శాఖ జారీ చేసిన మార్కెట్ విలువ ధ్రువీకరణ పత్రాలను సమర్పించాలి. భూసార పరీక్ష నివేదికను అందించాలి. లేఅవుట్ చుట్టూ ఉన్న నీటి వనరులకు సంబంధించి రెవెన్యూ జాయింట్ కలెక్టర్ ఇరిగేషన్ అథారిటీల అనుమతులను తీసుకోవాలి. లేఅవుట్‌కు సంబంధించి రోడ్డు వెడల్పు 30 నుంచి 60ఫీట్ల వరకు, ఎలక్ట్రికల్ లైన్, వాటర్ లైన్‌కు సంబంధించి మ్యాప్‌తో పూర్తి వివరాలు సమర్పించాలి. జీవో ఎంఎస్ నంబర్ 225 ప్రకారం డెవలప్‌మెంట్ చార్జీలు చెల్లించి అన్ని అనుమతులు తీసుకొని ప్లాట్లు విక్రయించాలి. కానీ ఇవేమీ తమకు తెలియదన్నట్టుగా రియల్టర్లు, వాటిని అధికారులు చూసీచూడనట్లుగా వ్యవహరించడం గమనార్హం. నిబంధనల ప్రకారం లేఅవుట్ ఏర్పాటు చేస్తే ప్రభుత్వానికి ఆదాయం రావడంతో పాటు ప్లాట్ కొనుగోలు చేసిన వారికి భవిష్యత్తులో ఇబ్బందులు ఉండవు.

ఇప్పటివరకు 21వెంచర్లకు మాత్రమే అనుమతి

సిద్దిపేట అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (సుడా) ఏర్పడిన నాటి నుంచి ఇప్పటివరకు 'సుడా' పరిధిలో ఉన్న గ్రామాల్లో 21 వెంచర్లకు మాత్రమే అనుమతులున్నట్లు అధికారులు చెబుతున్నారు. అనధికారికంగా సుడా పరిధిలో 50 నుంచి 60 వరకు వెంచర్లు ఉండవచ్చని అంచనా. అనుమతులకు మించి రెట్టింపుస్థాయిలో అక్రమ వెంచర్లు వెలిసినప్పటికీ అధికారులు ఉదాసీనంగా వ్యవహరించడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

స్థానిక నేతల అండదండలు ఉంటే చాలు

'సుడా' పరిధిలోని ఆయా గ్రామాల్లో వ్యవసాయ భూమిని కొనుగోలు చేసి వెంచర్ వేయాలి అనుకుంటే అనుమతులతో పనిలేదు స్థానిక నేతల అండదండలు ఉంటే చాలు అన్నట్టుగా రియల్‌ఎస్టేట్ వ్యాపారులు వ్యవహరిస్తున్నారు. ఒకవేళ అనుమతులు లేని వెంచర్ల వద్దకు అధికారులు వస్తే ఆ నేతలే అధికారులతో మాట్లాడి ఒప్పందం కుదుర్చుతున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నా యి. సంబంధిత అధికారులు స్పందించి అక్రమ లేఅవుట్లను గుర్తించి చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.


పొన్నాల రాజీవ్ రహదారి పక్కన వెలిసిన వెంచర్


సిద్దిపేట నుంచి కిష్టాసాగర్ గ్రామానికి వెళ్తున్న రోడ్డులో వెలిసిన వెంచర్

చర్యలు తీసుకుంటాం

'సుడా' పరిధిలో వెలిసిన అక్రమ వెంచర్లపై ఇప్పటికే చర్యలు తీసుకోవడం ప్రారంభించాం. సిద్దిపేటఅర్బన్ మండలంలోని మిట్టపల్లి పొన్నాల సమీపంలో అక్రమ లేఅవుట్‌ను తొలగించడం కూడా జరిగింది. మా దృష్టికి వచ్చిన అక్రమ లేఅవుట్లపై తప్పకుండా చర్యలు తీసుకుంటాం. ప్రభుత్వ నిబంధనల ప్రకారం అన్ని అనుమతులతో వెంచర్‌ను ఏర్పాటు చేసుకోవాలి. అనుమతులు లేని వెంచర్లలో ప్లాట్లు కొనుగోలు చేసి భవిష్యత్తులో ఇబ్బందులకు గురికావద్దు.

- ప్రసన్న రాణి, 'సుడా' వైస్ చైర్మన్

అసంపూర్తిగా అమరుల స్తూపం

● 14 ఏళ్లుగా పట్టించుకోని వైనం
● నాయకుల తీరుపై తెలంగాణ ఉద్యమకారుల మండిపాటు


తొగుటలో అసంపూర్తిగా అమరుల స్తూపం

తొగుట, మే 22: తెలంగాణ తొలి, మలి విడత ఉద్యమంలో అసువులు బాసిన అమరుల స్మారకార్థం తొగుటలో నిర్మిస్తున్న స్తూపం పనులు 14 ఏళ్లుగా కొనసాగుతూనే ఉన్నాయి. తెలంగాణ రాష్ట్రం ఏర్పాటై పదేళ్లు గడిచినా అమరుల త్యాగాలను విస్మరించడంపై ఉద్యమకారులు మండిపడుతున్నారు. ఉద్యమాల పేరుతో పదవులు పొందిన నాయకులు ఇప్పుడు ఇటువైపు కన్నెత్తి చూడడం లేదని వాపోతున్నారు. 2010లో సుమారు రూ.లక్ష వరకు దాతల నుంచి విరాళాలు సేకరించి తొగుటలో టీఆర్ఎస్ మండల నాయకులు స్తూప నిర్మాణ పనులు ప్రారంభించారు. నేటికీ ఆ స్తూపం పనులు పూర్తవ్వలేదు. తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం జూన్ 2న లోగా అమరుల స్తూపం పూర్తిచేయాలని ఉద్యమకారులు కోరుతున్నారు.

అమరుల ఆత్మఘోష వినిపించడం లేదా!

- యెన్నం భూపాల్‌రెడ్డి, జప్తిలింగారెడ్డిపల్లి (తెలంగాణ ఉద్యమకారుడు)



తెలంగాణ మలిదశ ఉద్యమంలో పాల్గొని ఎన్నో కేసుల్లో ఇరుక్కున్నం... అమరుల పోరాటాలకు ప్రతీకగా తొగుటలో 14 ఏళ్ల క్రితం విరాళాలు సేకరించి స్తూప నిర్మాణం మొదలు పెట్టాం. ఉద్యమంలో పాల్గొన్న వారిని పక్కన పెట్టి ఉద్యమద్రోహులు పార్టీలో చేరగానే అప్పట్లో పదవులు కట్టబెట్టారు. దాంతో మేము పక్కకు తప్పుకున్నం. ఇంకా స్తూప నిర్మాణం అసంపూర్తిగా ఉంది. అమరుల ఆత్మఘోష వినిపించడం లేదా...వారి త్యాగాలను ఇలాగే అవమానిస్తారా.

నాచగిరిలో ముగిసిన నృసింహ జయంత్యోత్సవాలు

వర్గల్, మే 22 : వర్గల్ మండలం నాచారం నాచగిరి లక్ష్మీనృసింహస్వామి క్షేత్రంలో స్వామివారి జయంత్యోత్సవాలు బుధవారం శతఘటాభిషేకంతో ముగిసాయి. ఉత్సవాల సందర్భంగా ఆలయంలో ఉదయం స్వామివారికి మూల మంత్ర హవనములు, మహాపూర్ణాహుతి, మూలవరులకు శతఘటాభిషేకంతో నివేదన సమర్పించి భక్తులకు తీర్థ ప్రసాదాలను అందజేశారు. సాయంత్రం స్వామి వారికి నృసింహ విర్భావముతో పాటు నివేదన తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించారు. వేడుకలను తిలకించడానికి క్షేత్రానికి భక్తులు వేలాది మంది తరలివచ్చారు. నాలుగు రోజుల పాటు జరిగిన ఉత్సవాలు ఆలయ కార్యనిర్వహణాధికారి ఎస్.అన్నపూర్ణ పర్యవేక్షణలో ఘనంగా ముగిసాయి. నృసింహ జయంత్యోత్సవాల్లో గజ్వేల్ కోర్టు జడ్జీ ప్రియాంక పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు.


స్వామివారిని దర్శించుకుంటున్న భక్తులు


శతఘటాభిషేకం నిర్వహిస్తున్న వేదపండితులు

రేపే పాలిసెట్

● సిద్దిపేటలో ఆరు పరీక్ష కేంద్రాలు
● హాజరుకానున్న 2,307 మంది విద్యార్థులు

సిద్దిపేటక్రైం, మే 22: ఈనెల 24న జరగనున్న పాలిసెట్-2024 పరీక్షలకు సిద్దిపేట జిల్లాలో అన్ని ఏర్పాట్లు పూర్తిచేసినట్లు గవర్నమెంట్ పాలిటెక్నిక్ ప్రిన్సిపాల్, ఎగ్జామ్ కో ఆర్డినేటర్ జి.సూర్యనారాయణ తెలిపారు. సిద్దిపేటలో ఆరు పరీక్షా కేంద్రాలను కేటాయించినట్లు పేర్కొన్నారు. మొత్తం 2,037మంది విద్యార్థులు పరీక్ష రాయనున్నట్లు తెలిపారు. ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 1.30 వరకు పరీక్ష జరుగుతుందన్నారు. విద్యార్థులు పరీక్షకు వచ్చేప్పుడు పెన్సిల్, బ్లూ లేదా బ్లాక్ పెన్నును వెంట తీసుకోవాలని, హాల్ టికెట్‌పై ఫోటో లేని వారు ఒక పాస్‌పోర్టు సైజు ఫోటో అతికించి గెజిటెడ్ అధికారి సంతకం చేయించుకుని రావాలన్నారు.

మూడోరోజు టెట్‌కు
29 మంది గైర్హాజరు

సిద్దిపేటక్రైం, మే 22 : సిద్దిపేట జిల్లాలో టెట్ ప్రశాంతంగా కొనసాగుతున్నది. జిల్లా కేంద్రంలో బుధవారం మూడోరోజు టెట్ పరీక్ష ఒకేసెంటర్‌లో నిర్వహించారు. ఉదయం 150 మందికి గాను 135 మంది సాయంత్రం150 మంది గాను 136 మంది హాజరయ్యారు. మొత్తంగా 29 మంది గైర్హాజరైనట్లు సెంటర్ నిర్వాహకులు తెలిపారు.

24 నుంచి ఇంటర్మీడియట్
సప్లిమెంటరీ పరీక్షలు

● సెంటర్ల వద్ద 144 సెక్షన్ : సీపీ

సిద్దిపేటక్రైం, మే 22 : ఈనెల 24 నుంచి జూన్ 3 వరకు ఇంటర్మీడియట్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు జరగనున్నాయి. జిల్లాలోని 27 పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులో ఉంటుందని సీపీ అనురాధ ప్రకటనలో పేర్కొన్నారు. పరీక్షలు జరిగే సమయంలో అన్ని జిరాక్స్ సెంటర్లను మూసివేయాలని, సెంటర్ల నుంచి 500 మీటర్ల వరకు ప్రజలు గుమిగూడ వద్దని సూచించారు. పరీక్షలు జరిగే సమయంలో పోలీసు అధికారులు పెట్రోలింగ్ నిర్వహిస్తారన్నారు. పోలీస్‌స్టేషన్ల నుంచి పరీక్షా కేంద్రాలకు ప్రశ్నపత్రాలు వెళ్లే సమయాల్లో కానిస్టేబుల్ తప్పనిసరిగా ఎస్కార్ట్‌గా ఉండాలని ఆదేశాలు జారీ చేశారు.



తీపి పంచని మామిడి

● పెట్టుబడులు ఎక్కువ.. ఆదాయం తక్కువ
● కాత సమయంలోనే తోటలు విక్రయం
● విక్రయించిన ధరకు, మార్కెట్ ధరకు భారీ వ్యత్యాసం
● దళారుల చేతుల్లో దగా పడుతున్న మామిడి రైతులు
7 లో

నాణ్యమైన విద్యుత్‌ను అందిస్తాం

● సిద్దిపేట జిల్లా
ఎస్ఈ మోహన్‌రెడ్డి


గజ్వేల్, మే 22: ప్రజలకు నాణ్యమైన విద్యుత్‌ను అందించేందుకు కృషిచేస్తామని విద్యుత్‌శాఖ సిద్దిపేట జిల్లా ఎస్ఈ పి.మోహన్‌రెడ్డి అన్నారు. గజ్వేల్ డివిజన్ పరిధిలోని గజ్వేల్, తునికిబొల్లారం, ప్రజ్ఞాపూర్, కొడకండ్ల, వంటిమామిడి. ములుగు, గౌరారం సబ్‌స్టేషన్లను బుధవారం ఆయన పరిశీలించి మాట్లాడారు. వేసవిలో, అలాగే రానున్న వర్షాకాలంలో ప్రజల గృహావసరాలకు, రైతులకు వ్యవసాయానికి ఇబ్బందులు లేకుండా నిరంతరం, నాణ్యమైన విద్యుత్‌ను అందించేందుకు కృషిచేస్తామన్నారు. ప్రస్తుతం అక్కడక్కడ మరమ్మతులు, చెట్ల నరికివేత కారణంగా విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని, ప్రజలు సహకరించాలని కోరారు. ఎక్కడెక్కడ విద్యుత్‌సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందనేది ముందుగానే ప్రజలకు తెలియజేస్తామన్నారు. ఇందుకు ప్రజలు, ప్రజాప్రతినిధులు, అధికారులు సహకరించాలని కోరారు. ఆయన వెంట విద్యుత్ శాఖ గజ్వేల్ డివిజన్ డీఈ భానుప్రకాశ్, గజ్వేల్ ఏడీ జగదీశ్ ఆర్య, ములుగు ఏడీ జి.శ్రీనివాస్, ఏఈలు గంధం మారుతి, సత్యం, సిబ్బంది ఉన్నారు.


గజ్వేల్‌లోని విద్యుత్ సబ్‌స్టేషన్‌ను పరిశీలిస్తున్న విద్యుత్ శాఖ ఎస్ఈ మోహన్‌రెడ్డి











పిడుగుపాటుతో జాగ్రత్త..!



● రైతులు, వ్యవసాయ కూలీలు అప్రమత్తంగా ఉండాలి

మెదక్ కల్చరల్, మే 22: ప్రస్తుతం ఎండాకాలమైనా అకాల వర్షాలు ప్రజలను, రైతులను అతలాకుతలం చేస్తున్నాయి. అయితే అకాల వర్షాల కారణంగా పిడుగులు పడే అవకాశం ఎక్కువగా ఉంటుంది. ఉమ్మడి మెదక్ జిల్లాలో అకాల వర్షాలు కురుస్తున్నాయి. ఆకాశం మేఘావృతమై, బలమైన ఈదురు గాలులు, వడగండ్లు పడుతున్నాయి. వర్షం పడేటప్పుడు ఆకాశంలో మెరుపులు, భయంకరమైన శబ్దాలతో అక్కడక్కడ పిడుగులు కూడా పడుతున్నాయి. అయితే వీటికి బలమైన అయస్కాంత శక్తితో కూడిన విద్యుత్ శక్తి ఉంటుంది. వీటి ప్రభావం వల్ల ఎక్కువగా రైతులు, వ్యవసాయ కూలీలే చనిపోతున్నారు. కొన్ని ప్రాంతాల్లో చెట్ల కింద కట్టేసి ఉన్న జంతువులూ కూడా చనిపోతున్నాయి. ఈ క్రమంలో పొలాల వద్ద ఉండే రైతులు, రైతు కూలీలు అప్రమత్తంగా ఉండాలి. వర్ష సూచన కనిపించినా, ఆకాశం మేఘావృతమైనా వెంటనే ఇళ్లకు బయలుదేరడం మంచిది. వర్షాలు వరుసగా కురుస్తుండడంతో ధాన్యం ఎండక రైతులు సతమవుతున్నారు. ఈ క్రమంలోనే ధాన్యం ఆరబెట్టేందుకు ఈ నెల 11న పెద్దశంకరంపేట మండలం రామోజీపల్లి గ్రామానికి చెందిన తండ్రి, కొడుకు వెళ్లగా ఒక్క సారిగా వర్షం రావడంతో చెట్టుకింద నిల్చున్నారు. ఆ సమయంలో వారిపై పిడుగు పడి మృతి చెందారు.

పిడుగు అంటే ఏమిటి?

మేఘాలలో ఉష్ణోగ్రత చాలా తక్కువగా ఉండడం వలన వర్షపు నీరు చిన్న చిన్న మంచు కణాలుగా విడిపోతుంది. అయితే విపరీతమైన గాలులు వచ్చినప్పుడు వీటి మధ్య రాపిడి జరిగి ఒక విద్యుత్ శక్తి విడుదలవుతుంది. ఇందులో పాజిటివ్ కణాలు తేలికగా ఉండటం వలన మేఘాల పైకి వెలుతుంటే, నెగటివ్ కణాల బరువు ఎక్కువగా ఉండి మేఘాల కిందకు వెళ్తాయి. అయస్కాంతంలో ఉత్తర, దక్షిణ ధ్రువాలు ఆకర్షించుకున్నట్లుగానే రెండు మేఘాలు దగ్గరగా వచ్చినప్పుడు పాజిటివ్, నెగటివ్ కణాలు ఆకర్షించుకొని ఆకాశంలో మెరుపులు వస్తుంటాయి. ఈ సమయంలో మేఘాలలో నెగటివ్ కణాలు భూమిలోని పాజిటివ్ కణాలు ఆకర్షిస్తుంటాయి. అప్పుడు భూమిపై ఎత్తుగా ఉండే చెట్లు, గుట్టలు, మనుషులు, సెల్ టవర్స్ ద్వారా రాపిడి జరిగి మెరుపులతో కూడిన పిడుగు పడుతుంది.


ఈ జాగ్రత్తలు పాటించాలి

వర్షాలు పడే సమయంలో బయటకు వెళ్లకపోవడం ఉత్తమం. ముఖ్యంగా వ్యవసాయ పనులు చేసే వారు, రైతు కూలీలు అప్రమత్తంగా ఉండాలి. ఆకాశంలో మెరుపులు, ఉరుములు వస్తుంటే చెట్ల కిందకు, విద్యుత్ టవర్‌ల కిందకు, ట్రాన్స్‌ఫార్మర్ల దగ్గరకు వెళ్లవద్దు. వ్యవసాయ పనులు చేసేటప్పుడు ఉరుములు, మెరుపులు వస్తుంటే పిడుగులు పడతాయని భావించి రైతులు మరింత జాగ్రత్తగా ఉండాలి. వెంటనే సురక్షిత ప్రాంతానికి చేరుకోవాలి. వీలు కాకపోతే సమయస్ఫూర్తితో ఉండాలి. మోకాళ్లపై చేతులు, తల పెట్టి దగ్గరగా ముడుచుకొని కూర్చోవాలి. దీనివల్ల సమీపంలో పిడుగు పడినా అందులో విద్యుత్ ప్రభావం తక్కువగా పడి బతికే అవకాశం ఎక్కువగా ఉంటుంది. పిడుగు పడే అవకాశాలు ఉన్నాయన్నపుడు రబ్బర్ చెప్పులు వేసుకోవడం మంచిది. వేసుకోలేని పరిస్థితి ఉన్నప్పుడు కాళ్లు భూమి మీద పూర్తిగా ఆనించకుండా కాలి వేళ్ల మీద నిల్చునేందుకు ప్రయత్నించాలి.











తీపి పంచని మామిడి



● పెట్టుబడులు ఎక్కువ.. ఆదాయం తక్కువ
● కాత సమయంలోనే తోటలు విక్రయం
● విక్రయించిన ధరకు, మార్కెట్ ధరకు భారీ వ్యత్యాసం
● దళారుల చేతుల్లో దగాపడుతున్న మామిడి రైతులు

తోపుడు బండ్లపై నోరూరించేలా కనిపించే మామిడి పండ్లను ధర ఎంతైనా సరే చెల్లించి ప్రజలు కొంటారు. తోపుడు బండ్ల వ్యాపారు అమ్మే ధరను చూసి మామిడి పండ్లను ఉత్పత్తి చేసే రైతులు మాత్రం అవాక్కవుతున్నారు. దళారులకు విక్రయించిన ధరకు, మార్కెట్‌లో ఉన్న ధరకు భారీగా వ్యత్యాసం ఉండడమే ఇందుకు కారణం. దీంతో నోరూరించే పండ్లను ఉత్పత్తి చేసే తమకు చేదే మిగులుతున్నదని మామిడి రైతులు ఆవేదన చెందుతున్నారు.

జహీరాబాద్, మే 22: అకాల వర్షాలు, వర్షాలలేమి ప్రభావంతో పంటను పండించడం ఒక ఎత్తైతే, మామిడి పండ్లను అమ్ముకోవడం రైతులకు మరో సమస్యగా తయారైంది. మామిడి కాయలను కోసి వాటిని మగ్గబెట్టి, మార్కెట్‌కు తీసుకెళ్లి విక్రయించడం సమస్యగా భావించి రైతులు నేరుగా తోటలను కాత సమయంలోనే అమ్మేస్తారు. మార్కెటింగ్, అకాల వర్షాలు తదితరాలను దృష్టిలో పెట్టుకుని పండ్లను మార్కెట్‌కు తరలిస్తే వచ్చే లాభ, నష్టాలను బేరీజు వేసుకుని, ఎకరాకు ఎంతో కొంతగా నిర్ధారించుకుని మామిడి తోటలను కాత సమయంలోనే నేరుగా దళారులకు విక్రయిస్తారు. దీంతో వచ్చినదాంతో రైతులు తృప్తి చెందగా, దళారులు మాత్రం భారీగా లబ్ధిపొందుతున్నారు.

ఎకరా సాగుకు రూ.2లక్షల ఖర్చు

జహీరాబాద్ నియోజకవర్గంలోని కోహీర్, ఝరాసంగం, న్యాల్‌కల్, జహీరాబాద్, మొగుడంపల్లి మండలాల్లో మామిడితోటలను రైతులు ఎక్కువగా సాగు చేస్తున్నారు. సుమారు వంద రకాల మామిడి ఉండగా ఇక్కడి రైతులు అన్ని రకాల మామిడి పండ్లను సాగు చేస్తున్నారు. ఎకరా పొలంలో మామిడితోటను సాగు చేస్తే ఐదేళ్ల తర్వాత కాతవచ్చే సమయం వరకు సుమారు రూ.2లక్షలకు పైగానే పెట్టుబడి పెట్టాల్సి వస్తుంది. మొదటి ఏడాది ఎకరా పొలంలో సగటున 60నుంచి 80 మొక్కలను నాటుతారు. మొక్కకు మొక్కకు 20 అడుగుల దూరంలో నాటుతారు. మొదటి సంవత్సరంలో డ్రిప్, మొక్కలు, దుక్కులు తదితరాలు కలిపి సుమారు రూ.80వేల వరకు ఖర్చు అవుతుంది. మరో నాలుగేళ్లపాటు ఏడాదికి రూ.30వేల చొప్పున రూ.1.20లక్షల పైచిలుకు ఖర్చు చేయాల్సి ఉంటుంది. వీటికి తోడు ఏటా ఎకరాకు రూ.30వేల పైచిలుకు చెట్లు ఉన్నంతవరకు సస్యరక్షణచర్యలకు ఖర్చులు చేస్తారు.


జహీరాబాద్ మార్కెట్‌లో మామిడి పండ్లను విక్రయిస్తున్న వ్యాపారులు

10వేల ఎకరాల్లో మామిడితోటలు

జహీరాబాద్ నియోజకవర్గంలో ఏటా మామిడి పంట సాగు విస్తీర్ణం పెరుగుతున్నది. 2020-21లో 7,300 ఎకరాల్లో సాగయితే.. 2021-22లో 7వేల ఎకరాల్లో, 2022-23లో 7,500 ఎకరాలు, 2023-24లో సుమారు 10వేల ఎకరాలకు మామిడిపంట సాగు విస్తరించింది. ప్రభుత్వం సహకరిస్తే పంట సాగు మరింత పెరిగే అవకాశం ఉందని రైతులు పేర్కొంటున్నారు.



ఎకరాకు రూ.25-30వేల చొప్పున విక్రయం

మామిడి చెట్టు జీవితకాలం 40 సంవత్సరాలుంటుంది. ఒక్కో చెట్టుకు సగటున 350-800 వరకు కాయలుంటాయి. ఎకరాకు 150-250 టన్నుల వరకు దిగుబడి వస్తుంది. ప్రాసెసింగ్ తదితరాల విషయంలో రైతులు రిస్క్ తీసుకోకుండా కాత సమయంలో మామిడితోట్లను నేరుగా దళారులకు ఎకరాకు రూ.25-30వేల చొప్పున అమ్ముతుంటారు. మామిడిపండ్లు కిలో రూ.30చొప్పున మార్కెట్‌లో విక్రయిస్తే ఒక్క టన్నుకు రైతుకు ఏడాదికి ఒక ఎకరాకు రూ.40 నుంచి రూ.45 వేల వరకు ఆదాయం వస్తుంది. ప్రస్తుతం మార్కెట్‌లో మామిడి పండు ధర కిలోకు రూ.50-100 వరకు ఉన్నది.

జహీరాబాద్ మార్కెట్‌కు ప్రతిరోజు 100 టన్నులు

జహీరాబాద్ పట్టణంలోని ఎడ్ల బజార్‌లో గల మార్కెటింగ్ దుకాణ సముదాయాల్లో 28మంది లైసెన్సులు పొందిన పండ్ల వ్యాపారులు ఉన్నారు. ప్రతి సీజనకు సంబంధించిన వివిధరకాల పండ్లు ప్రతి రోజు ఈ మార్కెట్‌కు వస్తాయి. ప్రస్తుతం మామిడిపండ్ల సీజన్ కావడంతో రైతుల వద్ద తోటలను కొనుగోలు చేసిన దళారులు(వ్యాపారులు) ప్రతిరోజు జహీరాబాద్ మార్కెట్‌కు సుమారు 100 టన్నులకు పైగానే మామిడి పండ్లను తీసుకువస్తారు. కర్ణాటక, మహారాష్ట్రలకు చెందిన వ్యాపారులు సైతం ఇక్కడికి మామిడిపండ్లను, తీసుకురావడం, ఇంకొందరు చిరువ్యాపారులు ఇక్కడి నుంచి వేలంలో పాటపాడి తిరిగి అక్కడికి తీసుకెళ్లడం సహజమే. సుమారు టన్ను ఒక్కంటికి రూ.35వేలు మార్కెట్‌లో ధర ఉండగా, 100 టన్నులకు గాను జహీరాబాద్ మార్కెట్‌లో రూ.3నుంచి రూ.4లక్షల వరకు అమ్మకాలు జరుగుతుంటాయి. మధ్యదళారులు తీసుకువచ్చిన పండ్లను స్థానికంగా ఉన్న చిరు వ్యాపారులు, తోపుడు బండ్ల వ్యాపారులు వాటిని తీసుకెళ్లి కిలో రూ.50-100 వరకు అమ్ముతుంటారు. దీంతో రైతులకు పెద్దగా ప్రయోజనం లేక పోయినప్పటికీ మధ్యదళారులు, చిరువ్యాపారులు రెట్టింపుస్థాయిలో ప్రయోజనం పొందుతున్నారు.

రూ.2లక్షలకే తోటలను అమ్ముతున్నా



తొమ్మిదెకరాల్లో నాలుగైదు రకాల మామిడితోటలను వేశాను. ఏటా కాత సమయంలో సుమారు సుమారు రూ.2లక్షలకే తోటలను అమ్ముతున్నా. ప్రాసెసింగ్, తదితరాలతో ఇబ్బందులు పడేకంటే కాతసమయంలో అమ్ముకుంటే కొంత మేరకు ప్రయోజనం ఉంటుంది. ప్రాసెసింగ్ చేసి పండ్లను మార్కెట్‌కు తరలిస్తే రెట్టింపు స్థాయిలో లబ్ధిపొందే అవకాశంతో పాటు నష్టం కూడా జరిగే అవకాశం ఉంటుంది. అయితే ఎకరాకు సగటున రూ.50వేల వరకు వస్తే మరింత ప్రయోజనం ఉంటుంది.

- రాజ్‌కుమార్ దేశ్‌పాండే, రైతు, మనియార్‌పల్లి, కోహీర్

రైతులు గ్రూప్‌గా ఏర్పడి ప్రాసెసింగ్ చేస్తే ప్రయోజనం



రైతులు గ్రూప్‌గా ఏర్పడి మామిడిని ప్రాసెసింగ్ చేస్తే అన్ని విధాలుగా ప్రయోజనం ఉంటుంది. మామిడిని పండ్ల కోసమే కాకుండా ఆమ్‌చూర్, తదితర విధాలుగా తయారుచేసి విక్రయిస్తే బాగుంటుంది. మామిడిపండ్లను సుమారు రెండు నెలల పాటు నిల్వచేసే అవకాశం ఉంటుంది. ఈ మేరకు రైతులకు సహకరించే విధంగా అన్ని ఏర్పాట్లు చేస్తున్నం.

- శైలజ, ఉద్యానశాఖ అధికారిణి

ఖరీఫ్ సీజన్‌లో రైతులు పొలాల్లో

యాజమాన్య పద్ధతులను పాటించాలి


జాంగారిబౌలి తండాలో మహిళా రైతులకు ఎరువుల తయారీపై అవగాహన కల్పిస్తున్న శాస్త్రవేత్తలు

జహీరాబాద్, మే 22: ఖరీఫ్ సీజన్‌లో రైతులు పొలాల్లో యాజమాన్య పద్ధతులను పాటించాలని డీడీఎస్-కేవీకే (డెక్కన్‌డెవలప్‌మెంట్ సొసైటీ-కృషివిజ్ఞాన కేంద్రం) శాస్త్రవేత్తలు తదితరులు పేర్కొన్నారు. ఖరీఫ్ సీజన్ ప్రారంభమైన నేపథ్యంలో రైతులు పొలాల్లో చేపట్టాల్సిన కార్యక్రమాలపై బుధవారం సంగారెడ్డి జిల్లా మొగుడంపల్లి మండలం జాంగారిబౌలి తండాలో మహిళా రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రైతులు పొలాల్లో భూసార పరీక్షలను తప్పకుండా చేయించాలని సూచించారు. భూసార పరీక్షల నివేదిక ఆధారంగా ఏ రకమైన పంటవేస్తే బాగుంటుందనే విషయంపై రైతులకు అవగాహన వస్తుందన్నారు. భూసార పరీక్షలు చేయించుకున్న రైతులకు పొలాల్లో కార్డును ఇస్తామని, దాని ఆధారంగా ఎరువులను ఏ విధంగా వాడాలనే అంశంపై అవగాహన వస్తుందన్నారు. రైతులు పొలాల్లో సేంద్రీయ ఎరువులనే వాడాలని సూచనలు చేశారు. అలాగే సేంద్రియ ఎరువుల తయారీపై రైతులకు అవగాహన కల్పించారు. అందులో భాగంగా ఘన, ద్రవ జీవామృతం తయారీ, దశపర్ణికషాయం, బ్రహ్మాస్త్రం తదితర పిచికారి ఎరువుల తయారీ విధానాన్ని రైతులకు నేర్పించారు. రైతులకు పంటలసాగు తదితరాలపై అవగాహన ఉన్నప్పటికీ అధికారుల, శాస్త్రవేత్తల సలహాలు, సూచనలు తప్పకుండా పాటించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రైతులు, డీడీఎస్ ఉద్యోగులు పాల్గొన్నారు.

దుకాణాల్లో సబ్సిడీ విత్తనాలు

● రైతు నేస్తంలో మెదక్ జిల్లా వ్యవసాయ అధికారి గోవింద్


రామాయంపేటలో ఫర్టిలైజర్ షాప్‌ను తనిఖీ చేస్తున్న గోవింద్

రామాయంపేట, మే 22: ఫర్టిలైజర్ దుకాణాల్లో సబ్సిడీపై విత్తనాలు అమ్మకానికి సిద్ధంగా ఉన్నాయని మెదక్ జిల్లా వ్యవసాయ అధికారి గోవింద్ తెలిపారు. ప్రస్తుతం విత్తనాలకు ఎలాంటి కొరత లేదన్నారు. బుధవారం రామాయంపేట రైతు నేస్తం కార్యక్రమంలో ఆయన పాల్గొని, మాట్లాడారు. డిమాండ్‌కు సరిపోయేలా విత్తనాలు అందుబాటులో ఉన్నాయని, రైతులు ఆందోళన పడాల్సిన అవసరం లేదని చెప్పారు. జిల్లా వ్యాప్తంగా 3,73,509 ఎకరాల్లో వివిధ రకాల పంటలు సాగుకు అంచనా వేసినట్లు వెల్లడించారు. అలాగే వర్షాలు కురుస్తున్నాయని రైతులు తొందరపడవద్దని, ఇపుడు భూమిలో తేమ శాతం తక్కువగా ఉన్నదని వివరించారు. అంతకు ముందు మండల అధికారి రాజ్ నారాయణతో కలిసి ఫర్టి లైజర్ దుకాణాలను తనిఖీ చేశారు.

ప్రకృతి రక్షణతోనే జీవవైవిధ్య పరిరక్షణ సాధ్యం

మెదక్ అర్బన్/కంది, మే 22: ప్రకృతి రక్షణతోనే జీవవైవిధ్య పరిరక్షణ సాధ్యమని మెదక్ అదనపు కలెక్టర్ రమేష్ పేర్కొన్నారు. బుధవారం కలెక్టరేట్‌లో ప్రపంచ జీవవైవిధ్య దినోత్సవాన్ని విద్యార్థినులతో కలిసి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జీవ జాతుల్లో గొప్పది మానవజన్మ అని, మిగిలిన జీవరాశులను పోషించి, రక్షించాల్సిన బాధ్యత మానవునిదేనన్నారు. మానవుడి మనుగడ జీవవైవిధ్యంపై ఆధారపడిందన్నారు. మొక్కలు నాటడంతో పర్యావరణ సమతుల్యత ఏర్పడుతుందని చెప్పారు. భావి భాతర పౌరులుగా విద్యార్థులు ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాధికారి రాధాకిషన్, జడ్పీ సీఈవో ఎల్లయ్య, డీఎస్‌వో రాజిరెడ్డి, కో ఆర్డినేటర్ సుదర్శన్‌మూర్తి తదితరులు పాల్గొన్నారు. కంది మండలపరిధిలోని ఇంద్రకరణ్ గ్రామంలో పంచాయతీ కార్యదర్శుల రాష్ట్ర మహిళా ఉపాధ్యక్షురాలు ఎంఎ్‌స వాణి ఆధ్వర్యంలో జీవ వైవిధ్య సదస్సును నిర్వహించారు. కార్యక్రమంలో జీవ వైవిధ్య కమిటీ జిల్లా కో-ఆర్డినేటర్ వెంకట్ పాల్గొన్నారు.


మెదక్‌లో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ రమేష్

విద్యా విప్లవ సృష్టికర్త భాగ్యరెడ్డి వర్మ

● జయంతిలో మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్

మెదక్ అర్బన్, మే 22: అణగారిన వర్గాలకు మెరుగైన విద్యను అందించి విద్యా విప్లవం సృష్టించిన మహనీయుడు భాగ్యరెడ్డి వర్మ అని మెదక్ కలెక్టర్ రాహుల్ రాజ్ కొనియడారు. భాగ్యరెడ్డి వర్మ 136వ జయంతి సందర్భంగా బుధవారం మెదక్ కలెక్టరేట్‌లో ఎస్సీ అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో భాగ్యరెడ్డి వర్మ చిత్రపటానికి కలెక్టర్ పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. దళిత బాలికల కోసం పాఠశాలలను స్థాపించి వారి అభ్యున్నతికి గట్టి పునాదులు వేశారన్నారు. దళిత వైతాళికుడిగా ప్రసిద్ధి చెందిన గొప్ప వ్యక్తి అని కొనియాడారు. అంటరాని కులాల ఉద్ధరణకై 1911లో మన్యసంఘాన్ని ఏర్పాటు చేసి, ప్రజల్లో సాహిత్యం, హరికథలు, ఉపన్యాసాల ద్వారా చైతన్యం తీసుకొచ్చేందుకు కృషి చేశారని వివరించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ రమేష్, జిల్లా ఎస్సీ అభివృద్ధి అధికారి విజయలక్ష్మి, జిల్లా బీసీ అధికారి నాగరాజ్‌గౌడ్, జిల్లా సైన్స్ అధికారి రాజిరెడ్డి, కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


మెదక్ కలెక్టరేట్‌లో భాగ్యరెడ్డి వర్మ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కలెక్టర్ రాహుల్ రాజ్, అదనపు కలెక్టర్ రమేష్, వివిధ శాఖాల అధికారులు

పశుగ్రాసం కొరత.. పశుపోషకుల అవస్థలు

● ఇతర ప్రాంతాల్లో కొనుగోలు, తరలింపు

నారాయణఖేడ్, మే 22: ఒక వైపు ఎండల తీవ్రత, మరో వైపు పశుగ్రాసం కొరతతో పశువులను పోషించుకోవడానికి పశుపోషకులు అవస్థలకు గురవుతున్నారు. ఏటా వేసవిలో పశుగ్రాసం కొరత ఏర్పడుతున్నప్పటికీ, ఈ సంవత్సరం ఎండ తీవ్రత అధికం కావడానికి తోడు గ్రాసం కొరత కూడా తీవ్రమైందని పశుపోషకులు అంటున్నారు. ఇటీవలి వరకు రైతులు సంప్రదాయ పంటలైన జొన్న పంటను అధికంగా సాగు చేసేవారు. దీనికి తోడు వరిసాగు చేసే రైతులు పంటను కూలీలతో కోయించే వారు. ప్రస్తుతం జొన్న సాగు కనుమరుగైంది. దీనికి తోడు వరిసాగు చేసిన రైతులు పంట కోతను కూలీల కొరతతో యంత్రాల ద్వారా చేయిస్తుండడంతో, కొరత ఏర్పడుతుందని పలువురు అంటున్నారు. పశుసంవర్ధ శాఖ అధికారుల లెక్కల ప్రకారం సంగారెడ్డి జిల్లా వ్యాప్తంగా ఆవులు, ఎద్దులు కలిపి లక్షా 56 వేల 282, గేదేలు లక్షా 68 వేల 995 ఉన్నాయి. మేకలు 4 లక్షల 38 వేల 475 ఉండగా, గొర్రెలు 2 లక్షల 29 వేల 331 ఉన్నాయి. ఈ పరిస్థితుల్లో పశువులను రక్షించుకోవడానికి నీటి వసతి ఉన్న రైతులు పశుగ్రాసాన్ని ప్రత్యేకంగా సాగు చేసి, పోషించుకుంటుండగా, నీటి వసతి లేని రైతులు ఇతర ప్రాంతాల నుంచి వరి గడ్డిని కొనుగోలు చేసి తెచ్చుకుంటున్నారు. గ్రాసం కొరత వల్ల వరి గడ్డికి కూడా డిమాండ్ ఏర్పడింది. ఇటీవలి వరకు వరి గడ్డి మోపు రూ.30 నుంచి 40 వరకు లభించేదని, ప్రస్తుతం రూ.వంద నుంచి రూ.150 వరకు పెరిగిందని పశుపోషకులు అంటున్నారు. నారాయణఖేడ్ ప్రాంతంలోని పశుపోషకులు సరిహద్దుల్లో ఉన్న కామారెడ్డి జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వరి గడ్డిని కొనుగోలు చేసి ఎద్దుల బండ్లు, ట్రాక్టర్లపై తెచ్చుకుంటున్నారు. ఈ విషయమై జిల్లా పశుసంవర్ధక శాఖ జేడీ వసంతకుమారిని సంప్రదించగా.. ఇప్పటి వరకు పశుగ్రాసం కొరత లేదని, అయినప్పటికీ ప్రభుత్వం ద్వారా గడ్డి సాగు విత్తనాలను సరఫరా చేసేందుకు ప్రతిపాదనలు పంపించామని తెలిపారు. సంగారెడ్డి జిల్లా వ్యాప్తంగా ఎస్సీ, ఎస్టీ రైతులకు సబ్సిడీపై పశుగ్రాసం విత్తనాలను సరఫరా చేసేందుకు 11 మెట్రిక్ టన్నులు సరఫరా చేయాలని ప్రభుత్వానికి ప్రతిపాదనలు అందించామని వెల్లడించారు. రెండు, మూడు రోజుల్లో విత్తనాలు సరఫరా చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని జిల్లా పశుసంవర్ధక శాఖ జేడీ వసంతకుమారి తెలిపారు.


ఇతర ప్రాంతాల్లో కొనుగోలు చేసి, తీసుకువస్తున్న పశుపోషకులు


మంగళవారం నర్సారెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరిన బీఆర్ఎస్ నేతలు

కండువాలు మారుస్తున్న నాయకులు

కుకునూరుపల్లి, మే 22: ప్రభుత్వం మారడంతో పలువురు నాయకులు, కార్యకర్తలు కూడా రోజుకో కండువాను మారుస్తున్నారు. మంగోల్ గ్రామానికి చెందిన పలువురు బీఆర్ఎస్ పార్టీలో ఉండగా, డీసీసీ అధ్యక్షుడు నర్సారెడ్డి సమక్షంలో మంగళవారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఏమైందో ఏమోగాని బుధవారం గ్రామ మాజీ సర్పంచ్ కిరణ్‌కుమార్ సమక్షంలో తిరిగి బీఆర్ఎస్‌లో చేరారు.


బుధవారం కాంగ్రెస్ నుంచి తిరిగి బీఆర్ఎస్‌లో చేరిన నేతలు

నర్సాపూర్ చెరువు సమీపంలో కుళ్లిన మృతదేహాలు

● ఒకటి మహిళదిగా, మరొకటి పురుషుడిదిగా గుర్తింపు

నర్సాపూర్, మే 22: మెదక్ జిల్లా నర్సాపూర్ సమీపంలోని రాయరావు చెరువు వద్ద కాగజ్‌మద్దూర్ వెళ్లే మార్గంలో నిర్మానుష ప్రదేశంలో ఓ మహిళ, ఓ పురుషుడి మృతదేహాలు బుధవారం లభ్యమయ్యాయి. వారిని అత్యంత దారుణంగా హత్య చేసి తగులబెట్టినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. పోలీసుల కథనం ప్రకారం... నర్సాపూర్-కాగజ్‌మద్దూర్ రోడ్డులో రాయరావు చెరువు సమీపంలో కుళ్లిపోయిన స్థితిలో రెండు మృతదేహాలు ఉన్నట్లు అటుగా వెళ్లిన స్థానికులు గుర్తించి, పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో సీఐ జాన్‌రెడ్డి, ఎస్‌ఐ పుష్పరాజ్‌లు సంఘటన స్థలానికి వెళ్లి పరిశీలించారు. రెండు శవాల్లో ఒకటి పురుషుడిదిగా, మరొకటి మహిళదిగా గుర్తించారు. మృతదేహాలు పూర్తిగా కుళ్లిపోయి, దుర్వాసన వస్తుండటంతో ఘటన జరిగి రెండు మూడు రోజులు అయి ఉంటుందని భావిస్తున్నారు. వారిద్దరిని ఎవరో చంపి, గుర్తుపట్టకుండా ఉండేందుకు పెట్రోల్‌పోసి తగులపెట్టినట్లు మృతదేహాల తీరును బట్టి తెలుస్తోంది. అయితే, ఈ మృతదేహాలు ఎవరివి.. ఎందుకు హత్య చేశారు అనే కోణంలో పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. క్లూస్‌టీం వచ్చి ఆధారాలు సేకరించింది.

అవిశ్వాసానికి కసరత్తు

● బొల్లారం మున్సిపల్ చైర్మన్ వర్గంలోని కౌన్సిలర్ అదృశ్యం
● ఇతర కౌన్సిలర్లకు వల వేస్తున్న కాంగ్రెస్?
● అప్రమత్తమయిన బీఆర్ఎస్ వర్గం, హరీశ్‌రావుతో బేటీ
● దైవ దర్శనాలు, క్యాంపుకులకు పయనం

జిన్నారం, మే 22: రాష్ట్ర వ్యాప్తంగా జరుగుతున్న అవిశ్వాసాల సెగ సంగారెడ్డి జిల్లా జిన్నారం మండలం బొల్లారం మున్సిపాలిటీని తాకింది. బీఆర్ఎస్‌కు చెందిన చైర్‌పర్సన్‌పై అవిశ్వాసం కోసం కాంగ్రెస్ నాయకులు తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నట్లు ప్రస్తుతం జరుగుతున్న పరిణామాలు స్పష్టం చేస్తున్నాయి. ఇటీవల బీఆర్ఎస్ నుంచి ఆరుగురు కౌన్సిలర్లు కాంగ్రెస్‌లో చేరగా.. అవిశ్వాసం కోసం గత నాలుగు రోజులుగా అధికార పార్టీ నాయకులు ఎత్తులు వేస్తున్నారు. చైర్మన్ వర్గానికి చెందిన ఓ కౌన్సిలర్ అదృశ్యం కాగా ఆయన భార్య ఈ నెల 21 పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కాగా తమ కౌన్సిలర్‌ను కాంగ్రెస్ నాయకులే అపహరించారని చైర్‌పర్సన్, కౌన్సిలర్లు అంటున్నారు. ఈ నేపథ్యంలో తమ కౌన్సిలర్లతో కలిసి మాజీ మంత్రి హరీశ్‌రావును కలిసి తాజా పరిణామాలపై చర్చించడంతో మండలంలో మున్సిపల్ అవిశ్వాసం అంశం హాట్ టాపిక్‌గా మారింది.

రాష్ట్రంలోనే అతిపెద్ద పారిశ్రామిక మున్సిపాలిటీ

రాష్ట్రంలోనే అతిపెద్ద పారిశ్రామిక మున్సిపాలిటీగా పేరున్న బొల్లారం మున్సిపాలిటీలో అవిశ్వాస అంశం చర్చనీయాంశమైనది. బొల్లారం మున్సిపాలిటీలో 22 మంది కౌన్సిలర్లు ఉండగా గత ఎన్నికల్లో బీఆర్ఎస్ నుంచి 17, కాంగ్రెస్-2, బీజేపీ నుంచి 3 కౌన్సిలర్లుగా గెలిచారు. రెండేళ్ల క్రితం ఓ మహిళా కౌన్సిలర్ మరణించగా ప్రస్తుతం 21 మంది ఉన్నారు. అసెంబ్లీ ఎన్నికల సమయంలో బీజేపీ కౌన్సిలర్లు ఇద్దరు బీఆర్ఎస్‌లో చేరగా, పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ నుంచి ఆరుగురు కౌన్సిలర్లు కాంగ్రెస్‌లో చేరారు. దీంతో బీఆర్ఎస్‌కు 12 మంది, కాంగ్రెస్‌కు 8 మంది, బీజేపీకి 1 కౌన్సిలర్లు ఉన్నారు. అవిశ్వాసం ప్రతిపాదన నెగ్గటం కోసం 11 మంది సంఖ్యాబలం కావాలి. దీంతో మరో ముగ్గురిని తమ శిబిరంలో చేర్చుకునేందుకు కాంగ్రెస్ నాయకులు ప్రయత్నాలు ముమ్మరం చేసినట్లు ప్రచారం జరుగుతుంది. ఈ నేపథ్యంలోనే చైర్‌పర్సన్ రోజారాణి వర్గానికి చెందిన ఓ కౌన్సిలర్‌ను అపహరించారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. సదరు కౌన్సిలర్ భార్య తన భర్త కనిపించడం లేదంటూ బీఆర్ఎస్ నాయకులతో కలిసి పీఎస్‌లో ఫిర్యాదు కూడా చేశారు.



రాజకీయ పరిణామాలపై హరీశ్‌రావుతో చర్చలు

బొల్లారంలో అవిశ్వాసం, కౌన్సిలర్లపై అధికార కాంగ్రెస్ పార్టీ నాయకుల వలతో అప్రమత్తమయిన చైర్‌పర్సన్ రోజారాణి, ఆమె భర్త, మాజీ జడ్పీటీసీ బాల్‌రెడ్డి తమ కౌన్సిలర్లను కాపాడుకునేందుకు రంగంలోకి దిగారు. అదృశ్యమయిన కౌన్సిలర్ భార్యతో పీఎస్‌లో ఫిర్యాదు చేయించి, ఇతర కౌన్సిలర్లను మాజీ మంత్రి హరీశ్‌రావుతో బేటీకోసం తీసుకెళ్లారు. ఈ మేరకు హరీశ్‌రావు మున్సిపాలిటీలో జరుగుతున్న రాజకీయ పరిణామాలపై చర్చించి, అధికార పార్టీ ఎత్తుగడలకు చిక్కకుండా వ్యవహరించాలనే దిశానిర్దేశం చేశారు. వెంటనే చైర్‌పర్సన్ వర్గం కౌన్సిలర్లతో, మాజీ జడ్పీటీసీ బాల్‌రెడ్డి ఇతర నాయకులు పలు దేవాలయాలు, ఇతర ప్రాంతాలకు క్యాంపుల కోసం తరలివెళ్లారు. దీంతో బొల్లారం మున్సిపాలిటీలో అవిశ్వాసం.. ఎత్తు గడలు మునుముందు ఏ మలుపులు తిరుగుతాయో అనేది చర్చనీయాంశమైనది.



సమావేశంలో మాట్లాడుతున్న అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి శ్రావణి యాదవ్

అసంఘటిత కార్మికులకు న్యాయ విజ్ఞాన సదస్సు

సిద్దిపేట క్రైం, మే 22: అసంఘటిత కార్మికుల కోసం న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహిస్తున్నట్లు అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి శ్రావణి యాదవ్ పేర్కొన్నారు. బుధవారం సిద్దిపేట కోర్టు ఆవరణలో జరిగిన న్యాయ విజ్ఞాన సదస్సులో ఆమె ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. కార్మిక పథకాలైన వివాహ బహుమతి పథకం, ప్రాణాంతక ప్రమాదాల లబ్ధి పథకం, సాధారణ మరణ లబ్ధి పథకం గురించి కార్మికులకు తెలియజేశారు. ప్రతీ కార్మికుడు తప్పనిసరిగా లేబర్ డిపార్ట్‌మెంట్‌లో పేరు నమోదు చేసుకొని గుర్తింపు కార్డును పొందాలని తెలిపారు. గుర్తింపు కార్డు ఉంటేనే సంక్షేమ పథకాలకు అర్హులని తెలిపారు. ఇంకా ఏమైనా సమస్యలుంటే జిల్లా న్యాయ సేవాధికార సంస్థను సంప్రదించాలని తెలిపారు. కార్యక్రమంలో లీగల్ డిఫెన్స్ కౌన్సిల్ బాలయ్య, శ్రీధర్ రెడ్డి, వెంకటేష్, న్యాయ సేవాధికార సంస్థ సిబ్బంది పాల్గొన్నారు.

సమయపాలన పాటించాలి

● డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ వినోద్ బాబ్జి


చింతమడక పీహెచ్‌సీలో సిబ్బందితో మాట్లాడుతున్న వినోద్ బాబ్జి

సిద్దిపేట రూరల్,మే 22: సిబ్బంది సమయపాలన పాటించి మెరుగైన వైద్య సేవలు అందించాలని డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ వినోద్ బాబ్జి పేర్కొన్నారు. 'ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి సుస్తీ' అనే శీర్షికన బుధవారం ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనానికి స్పందించిన డిప్యూటీ డీఎంహెచ్‌వో సిద్దిపేట రూరల్ మండలం చింతమడక ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించారు. సిబ్బంది సమయపాలన, సౌకర్యాలు వంటి అంశాలపై ఆరా తీశారు. కార్యక్రమంలో ఎన్‌సీడీ కో ఆర్డినేటర్లు సత్యనారాయణ, రాజేందర్, మెడికల్ ఆఫీసర్ బాపురెడ్డి, ఎంఎల్‌హెచ్‌పీలు డాక్టర్ అజయ్, ప్రియదర్శిని, సీహెచ్‌వో జాకీర్, హెచ్‌ఈవో జనార్దన్‌రెడ్డి ఉన్నారు.

పేరుకే డంపింగ్ యార్డులు..

శివారు ప్రాంతాల్లో చెత్త పారబోత

● అధికారుల ఆదేశాలూ బేఖాతర్
● రోడ్ల పక్కనే కాల్చేయడంతో కాలుష్యం
● పట్టించుకోని అధికారులు

చిన్నకోడూరు, మే 22: ప్రభుత్వం రూ. లక్షల నిధులు వెచ్చించి గ్రామాల్లో డంపింగ్ యార్డ్‌లను నిర్మించింది. ఆయా గ్రామాల్లో ఇళ్ల నుంచి సేకరించిన చెత్తను డపింగ్ యార్డ్‌కు తరలించాలని ప్రభుత్వం, ఉన్నతాధికారులు ఆదేశిస్తున్నప్పటికీ గ్రామాల్లో క్షేత్ర స్థాయిలో మాత్రం అమలు కావడం లేదు. మండలంలోని పలు గ్రామాల్లో ఇళ్ల నుంచి సేకరిస్తున్న చెత్తను పంచాయతీ సిబ్బంది డంపింగ్ యార్డులకు తరలించకుండా గ్రామాల శివారు ప్రాంతాల్లోనే పారబోసి చేతులు దులుపుకుంటున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు.

చెత్తను కాల్చేయడంతో కాలుష్యం

గ్రామాల్లో చెత్తను డంప్ యార్డ్‌లకు చేర్చకుండానే శివారు ప్రాంతాల్లో రోడ్లకు సమీపంలో పారబోసి కాల్చేస్తున్నారు. దాని నుంచి వెలువడే పొగతో వాహనదారులు, సమీప పొలాల రైతులు ఇబ్బందులు పడుతున్నారు. వ్యర్థాలు పారబోసే ప్రాంతాల్లో రోడ్ల పై శునకాలు స్వైరవిహారం చేస్తున్నాయి. దీంతో ఆ దారిన వెళ్లే వాహనదారులు, రైతులు భయాందోళనకు గురవుతున్నారు. గాలితో రోడ్ల పైకి చెత్త కొట్టుకువస్తోంది. చెత్త నుంచి వచ్చే దుర్వాసనతో వాహనదారులు, రైతులు ఉక్కిరిబిక్కిరవుతున్నారు.


పెద్దకోడూరు శివారులో చెత్తను కాల్చేయడంతో వస్తున్న పొగ

పట్టించుకోని అధికారులు

పలు గ్రామాల్లోని శివారు ప్రాంతాల్లో చెత్తను పడేసి కాలుస్తున్నా సంబంధిత అధికారులు చూసీ చూడనట్లుగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి, చెత్తను గ్రామాల శివారు ప్రాంతాల్లో పారబోసి కాల్చకుండా, డంపింగ్ యార్డ్‌లకు తరలించేలా చర్యలు తీసుకోవాలని ఆయా గ్రామాల ప్రజలు, వాహనదారులు కోరుతున్నారు.

డంపింగ్‌యార్డులకు తరలించేలా చర్యలు తీసుకుంటాం


గ్రామాల్లో ఇళ్ల నుంచి సేకరించిన తడి, పొడి చెత్తను పంచాయతీ సిబ్బంది డంపింగ్ యార్డ్‌లకు తరలిస్తున్నారు. ఏవైనా గ్రామాల్లో చెత్తను గ్రామాల శివారులో పడేసినట్లయితే, ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులకు సూచించి చెత్తను డంపింగ్ యార్డ్‌లకు తరలించేలా చర్యలు తీసుకుంటాం.

-జనార్దన్, ఎంపీడీవో, చిన్నకోడూరు

పచ్చిరొట్ట ఎరువుల విత్తనాల పంపిణీ ప్రారంభం

జగదేవ్‌పూర్, మే 22: డీసీఎంఎస్ రైతుసేవా కేంద్రం ద్వారా రైతులకు పచ్చిరొట్ట ఎరువుల విత్తనాలైన జనుము, జీలుగ విత్తనాలను ఏవో వసంతరావు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రసాయనిక ఎరువులను విపరీతంగా వినియోగించడం వలన భూసారం దెబ్బ తింటుందని, భూసారం పెంపొందించుకోవడానికి రైతులు రసాయనిక ఎరువుల వినియోగం తగ్గించి పచ్చిరొట్టె ఎరువులు ఉపయోగించాలన్నారు. ప్రభుత్వం 60 శాతం సబ్సిడీ మీద జనుము, జీలుగ విత్తనాలను మండల కేంద్రంలో పంపిణీ చేస్తుందని తెలిపారు. జనుము 40 కిలోల బస్తాకు రూ. 1,448, జీలుగ 30కిలోల బస్తాకు రూ. 1116 చెల్లించాలన్నారు. రైతులు ముందుగా సంబంధిత రైతు వేదికలలో పట్టాదారు పాస్‌బుక్కు, ఆధార్‌కార్డు జిరాక్స్‌తో వ్యవసాయ విస్తీర్ణ అధికారులను సంప్రదించి తమకు కావలసిన విత్తనాల కూపన్ పొంది తరువాత జగదేవ్‌పూర్‌లోని డీసీఎంఎస్ రైతుసేవా కేంద్రంలో డబ్బులు చెల్లించి విత్తనాలను పొందాలని తెలియజేశారు. కార్యక్రమంలో ఆయనతో పాటు వ్యవసాయ విస్తీర్ణ అధికారి ఖలీల్, డీసీఎంఎస్ రైతుసేవా కేంద్రం నిర్వాహకులు జిల్లా కిరణ్‌కుమార్, రైతులు పాల్గొన్నారు.


పచ్చిరొట్ట విత్తనాలు పంపిణీ చేస్తున్న దృశ్యం


వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ మను చౌదరి, సీపీ అనురాధ, అధికారులు

పట్టభద్రుల ఉపఎన్నిక పకడ్బందీగా నిర్వహించాలి

● రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్ రాజ్

సిద్దిపేట అగ్రికల్చర్, మే 22 : పకడ్బందీగా పట్టభద్రుల ఉప ఎన్నిక నిర్వహించాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్ రాజ్ అధికారులను ఆదేశించారు. బుధవారం రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్ రాజ్ హైదరాబాద్ నుంచి వరంగల్, ఖమ్మం, నల్గొండ శాసనమండలి పట్టభద్రుల ఉప ఎన్నికల ఏర్పాట్లపై నల్గొండ జిల్లా కలెక్టర్, రిటర్నింగ్ అధికారి తోపాటు, ఉప ఎన్నికలు జరిగే 12 జిల్లాల కలెక్టర్లు, రెవెన్యూ ఆదనపు కలెక్టర్లు,ఏఆర్‌ఓలతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. కాగా జనగామ అసెంబ్లీ నియోజకవర్గం పరిధిలో గల సిద్దిపేట జిల్లాలోని మద్దూరు, దూలిమిట్ట, చేర్యాల, కొమురవెల్లి మండలాల్లోని 4,679 మంది పట్టభద్రులు ఓటు హక్కును వినియోగించు కోనున్నారు. ఇందుకు 5 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా కలెక్టర్ మను చౌదరి, సీపీ అనురాధ, జిల్లా అదనపు కలెక్టర్ శ్రీనివాస్ రెడ్డి, హుస్నాబాద్ ఏసీపీ సతీష్ పాల్గొన్నారు.

మోడల్‌స్కూల్‌లో ఇంటర్మీడియట్‌కు కొత్త కోర్సులు

మద్దూరు, మే 22: మండల కేంద్రంలోని మోడల్‌స్కూల్‌లో ఇంటర్మీడియట్ విద్యార్థులకు 2024-25 విద్యాసంవత్సరానికి గాను కొత్త కోర్సులు అందిస్తున్నట్లు బుధవారం పాఠశాల ప్రిన్సిపాల్ వెంకన్న తెలిపారు. ఎంఈసీ/సీఈసీ స్ట్రీమ్‌ల కోసం టాలీ, అకౌంటెంట్, ఎంఎస్ ఆఫీసు, కమ్యూనికేటివ్ ఇంగ్లీషు, ఎంపీసీ/బైపీసీ స్ట్రీమ్‌ల కోసం ఈఏపీసీఈటీ/నీట్, ఐఐటీ, జేఈఈ కోచింగ్, ఎంఎస్ ఆఫీసు, కమ్యూనికేటివ్ ఇంగ్లీషు కోర్సులు అందిస్తున్నట్లు పేర్కొన్నారు. ఆసక్తి గల విద్యార్థులు ఈ నెల 25 లోపు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

గ్రామాభివృద్ధిలో అందరూ భాగస్వాములు కావాలి

ములుగు, మే 22: గ్రామపంచాయతీ పనుల్లో అందరూ భాగస్వాములు కావాలని ఎంపీవో నరసింహారావు కోరారు. బుధవారం మండలంలోని అన్నసాగర్, గంగాధర్‌పల్లి, వాగునూతి గ్రామపంచాయతీ పరిధిలో జరుగుతున్న పనులను ఆయన పరిశీలించారు.

సీజ్ చేసిన ఇసుక వేలం

ధూళిమిట్ట, మే 22: రెవెన్యూ అధికారులు, టాస్క్‌ఫోర్స్ పోలీసులతో కలిసి మంగళవారం జాలపల్లి గ్రామ శివారులో ఎలాంటి అనుమతులు లేకుండా నిల్వ ఉంచిన 25 ట్రాక్టర్ల ఇసుకను అదుపులోకి తీసుకున్నారు. ఈ ఇసుకను గురువారం ఉదయం 11 గంటలకు వేలం వేయనున్నట్లు ధూళిమిట్ట తహసీల్దార్ ఎర్రోళ్ల శ్యామ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి కలవారు రూ.5వేలు డిపాజిట్ చెల్లించి వేలం పాటలో పాల్గొనాలనీ సూచించారు.

జూన్ 1న కార్యసిద్ధి ఆంజనేయస్వామి జయంతి

గజ్వేల్, మే 22: గజ్వేల్‌లోని పాండవుల చెరువుకట్టపై గల శ్రీ కార్యసిద్ధి ఆంజనేయస్వామి ఆలయంలో జయంతి మహోత్సవాలను జూన్ 1న అంగరంగ వైభవంగా నిర్వహించనున్నట్లు ఆలయ పూజారి విఠాల సాయికృష్ణశర్మ బుధవారం తెలిపారు. జూన్ 1న ఉదయం సుప్రభాత సేవ, గణపతిపూజ, స్వస్తివాచనం, దేవతాహ్వానము, అష్టోత్తర శతమన్యుసూక్తం అభిషేకం, మూల విరాట్‌కు విగ్రహానికి ప్రత్యేక ఫలపుష్పాలతో అలంకరణ నిర్వహించనున్నట్లు తెలిపారు.

స్నేహితుడికి గూడు కల్పించిన మిత్రబృందం

హుస్నాబాద్, మే 23: ఇటీవల గాలి వానకు ఇల్లు కూలి నిరాశ్రయుడైన తమ చిన్ననాటి స్నేహితుడికి అండగా నిలిచి ఉదారతను చాటుకున్నారు. హుస్నాబాద్ పట్టణానికి చెందిన ఎగ్గోజు కనుకయ్య రోజు పని చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. కొన్ని రోజులుగా అతడు అనారోగ్య సమస్యలతో ఇబ్బంది పడుతున్నాడు. ఈ క్రమంలోనే ఇటీవల గాలి వానకు ఇళ్ళు కూలిపోయింది. తమ చిన్ననాటి స్నేహితుడి దీన స్థితిని చూసి ఎస్సెస్సీ 1989-90 బ్యాచ్ మిత్రులు అందరు కలిసి కనుకయ్య ఇంటి నిర్మాణానికి ఆర్థిక సహాయం అందించారు. ఇంటి నిర్మాణానికి కావాల్సిన దాదాపు రూ. 55,700 విలువ గల సామగ్రిని ఇప్పించారు. తోటి మిత్రులు అందించిన సహకారానికి కనుకయ్య కుటుంబం కృతజ్ఞతలు తెలిపింది. మిత్రులు పిట్టల రమేశ్, ప్రతాపగిరి శ్రీనివాస్, జేరిపోతుల సంజీవ్, గాజుల మహేశ్, వలువోజు పద్మనాభం, తాజ్‌పాషా, పెట్టుగడి శ్రీనివాస్, సంపత్, గాలిపల్లి రమణ్‌బాబు, ఎగ్గోజు చంద్రమౌళి తదితరులున్నారు.

సాదాసీదాగా మండలపరిషత్ సర్వసభ్య సమావేశం


సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ కొక్కుల కీర్తి

కోహెడ, మే 22: కోహెడ మండల సర్వసభ్య సమావేశం బుధవారం సాదాసీదాగా ముగిసింది. ఎంపీపీ కొక్కుల కీర్తి అధ్యక్షతన జరిగిన మండల సభకు ఎంపీటీసీలు, ప్రత్యేక అధికారులు, మండల అధికారులు హాజరయ్యారు. మండల ప్రజాపరిషత్ సభ్యుల పదవీకాలం ముగుస్తున్న నేపథ్యంలో చివరి సమావేశం ఏర్పాటు చేశారు. ఆయా శాఖల అధికారులు తమ నివేదికలను చదివి వినిపించారు. ముఖ్యంగా గ్రామాల్లో ఎండాకాలంలో తీసుకోవాల్సిన నీటి ఎద్దడి, విద్యుత్ సరఫరా, ఉపాధి హామీ పథకం, రానున్న విద్యా సంవత్సరానికి పాఠ్య పుస్తకాల పంపిణీ, విద్యార్థుల స్కూల్ యూనిఫామ్స్, ఉపాధి హామీ కూలీలకు వసతుల కల్పన తదితర అంశాలపై చర్చించారు. కురుమ, యాదవులు 300 మందికి పైగా గొర్రెల యూనిట్లు మంజూరు కోసం పశు సంవర్ధకశాఖకు డీడీలు అప్పజెప్పి రెండేళ్ల గడిచినా నేటికీ గొర్రెలు పంపిణీ చేయలేదని ఎంపీటీసీలు శ్రీనివాస్, కోనేశేఖర్‌లు ఆవేదన వ్యక్తంచేశారు. అనంతరం ఎంపీపీ మాట్లాడుతూ తన ఐదేళ్ల పదవీ కాలంలో ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేసి సహకరించారన్నారు. ప్రభుత్వ పాఠశాలలో మంచి ఫలితాలు వస్తున్నందున వచ్చే విద్యా సంవత్సరానికి ప్రజాప్రతినిధులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించాలని కోరారు. విద్యార్థులకు సరిపడా పాఠ్యపుస్తకాలు, దుస్తులు వచ్చాయని, త్వరగా పంపిణీ చేయాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ రాజిరెడ్డి, తహసీల్దార్ సురేఖ, ఎంపీడీవో కృష్ణయ్య, వివిధ శాఖల అధికారులు, గ్రామ ప్రత్యేక అధికారులు, ఎంపీటీసీలు ఉన్నారు.

స్త్రీ విద్యకు పునాది వేసిన భాగ్యరెడ్డివర్మ

● పలు మండలాల్లో జయంతి కార్యక్రమాలు

గజ్వేల్, మే 22: స్త్రీ విద్యకు పునాది వేసిన తొలి సామాజిక విప్లవకారుడు భాగ్యరెడ్డివర్మ అని డీబీఎఫ్ జాతీయ కార్యదర్శి పెద్దలింగన్నగారి శంకర్ పేర్కొన్నారు. గజ్వేల్ పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తా వద్ద, అంబేడ్కర్ భవన్‌లో భాగ్యరెడ్డివర్మ 136వ జయంతి సందర్భంగా బుధవారం ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 26 పాఠశాలలను ఏర్పాటు చేసి స్త్రీ విద్యను అందించిన గొప్ప సామాజిక విప్లవకారుడని కొనియాడారు. కార్యక్రమంలో దళిత ఉద్యోగుల ఐక్యవేదిక నాయకులు పి.ఎల్లయ్య, డీబీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి దాసరి ఏగొండస్వామి, జిల్లా కార్యదర్శి బ్యాగరి వేణు, గౌసోద్దీన్, చంద్రం, కనకస్వామి తదితరులున్నారు. అదేవిధంగా గజ్వేల్ పట్టణంలోని అంబేడ్కర్ భవనంలో భాగ్యరెడ్డివర్మ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి మాల మహానాడు జాతీయ నాయకుడు తుమ్మ శ్రీనివాస్ ఆధ్వర్యంలో పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఆయా సంఘాల నాయకులు పంబాల ఎల్లయ్య, దమ్మని మల్లయ్య మాచాపురం బాల్‌నర్సయ్య, పాములపర్తి స్వామి, కనకయ్య తదితరులున్నారు.

● జగదేవ్‌పూర్: ఆది హిందూ ఉద్యమ పితామహుడు మాదరి భాగ్యరెడ్డివర్మ అని మాల మహానాడు మండల అధ్యక్షుడు శివలింగం పేర్కొన్నారు. భాగ్యరెడ్డి వర్మ జయంతి సందర్భంగా బుధవారం జగదేవ్‌పూర్‌లో అంబేడ్కర్ విగ్రహం వద్ద ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సభ్యులు కుమార్, శేఖర్, మహేష్, నవీన్, పరశురాం తదితరులు పాల్గొన్నారు.

● దుబ్బాక: ఆదిమూలవాసులను చైతన్య పరిచిన దళిత ఉద్యమనేత భాగ్యరెడ్డి వర్మను ప్రతిఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని డీబీఎఫ్ జాతీయ కార్యదర్శి శంకర్ పేర్కొన్నారు. బుధవారం దుబ్బాక మున్సిపాలిటీలోని లచ్చపేట వార్డులో కౌన్సిలర్ బంగారయ్యతో కలిసి భాగ్యరెడ్డివర్మ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కౌన్సిలర్ ఆస యాదగిరి, నాయకులు శ్రీకాంత్, ఆస రవి, శేఖర్ తదితరులున్నారు.


గజ్వేల్‌లో భాగ్యరెడ్డివర్మ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

దైవ నామస్మరణతో కష్టాల నుంచి విముక్తి


చందాపూర్‌లో హనుమాన్ భక్తులతో కలిసి పూజలో రంగంపేట పీఠాధిపతి మాధవానందసరస్వతి స్వామి

తొగుట, మే 22: దైవ నామస్మరణతో ప్రజల కష్టాలన్నీ గట్టెకుతాయని రంగంపేట పీఠాధిపతి మాధవానంద సరస్వతిస్వామి ఉద్బోధించారు. బుధవారం మండలంలోని చందాపూర్ గ్రామంలో హనుమాన్ పూజా కార్యక్రమంలో ఆయన పాల్గొని భక్తులకు అనుగ్రహ భాషణం చేశారు. అంతకుముందు ఆలయంలో 108 జంటలతో కలిసి స్వామివారికి ధూప, దీప నైవేద్యం సమర్పించి పూలు పాలతో అభిషేకించారు. అనంతరం హనుమాన్ భక్తులకు అన్న ప్రసాద్ వితరణ చేపట్టారు. కార్యక్రమంలో గ్రామ మాజీ సర్పంచ్ నర్సింహులు తదితరులు పాల్గొన్నారు.

ఆలయాలను సందర్శించిన మాజీ మంత్రి


సిద్దిపేట రూరల్: అమ్మవారి సన్నిధిలో మాజీ మంత్రి హరీశ్‌రావును సన్మానిస్తున్న గౌడసంఘం నాయకులు

సిద్దిపేట రూరల్, మే 22: సిద్దిపేట రూరల్ మండలం వెంకటాపూర్ గ్రామంలో గౌడసంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శ్రీ రేణుక ఎల్లమ్మ ఉత్సవాల్లో బుధవారం మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఎల్లమ్మ తల్లి దీవెనలతో ప్రజలంతా సుఖసంతోషాలతో ఉండాలని కోరారు. ఆయన వెంట మాజీ సూడా చైర్మన్ రవిందర్ రెడ్డి, మాజీ జడ్పీటీసీ బాల్‌రంగం, మాజీ సర్పంచ్ దేవేందర్‌రెడ్డి, గౌడ సంఘం అధ్యక్షుడు అంబటి శ్రీనివాస్‌గౌడ్, సంఘం సభ్యులు ఉన్నారు.

● నంగునూరు: మండలంలోని రాజగోపాల్‌పేట పెద్దమ్మ ఆలయంలో, నర్మెట గ్రామంలో శ్రీసీతారామచంద్రస్వామి బ్రహ్మోత్సవాల్లో బుధవారం మాజీమంత్రి హరీశ్‌రావు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మాట్లాడుతూ, ఈ యేడు గ్రామదేవతలు కరుణించి సమృద్ధిగా వర్షాలు కురిపించాలని కోరుకున్నట్లు తెలిపారు. నర్మెట రామాలయంలో హరీశ్‌రావును ఆలయ కమిటీ చైర్మన్ రాళ్లబండి రమణాచారి సత్కరించి, మెమొంటోను అందజేశారు. ఆయన వెంట మాజీ ఎంపీపీ శ్రీకాంత్‌రెడ్డి, సోమిరెడ్డి, పరమాండ్ల మల్లేశం, మాజీ సర్పంచు నార్లపురం శ్రీనివాస్, పుప్పాల నారాయణ, ఆలయ కమిటీ చైర్మన్ రమణాచారి, శేఖర్‌గౌడ్, రామ్మోహన్ పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ కార్యకర్తకు పరామర్శ

సిద్దిపేట రూరల్,మే 22: సిద్దిపేట రూరల్ మండలం పెద్దలింగారెడ్డిపల్లి గ్రామంలో బీఆర్‌ఎస్ సీనియర్ కార్యకర్త బట్టు భాస్కర్‌రెడ్డి తండ్రి ఇటీవల అనారోగ్యంతో మరణించారు. మాజీమంత్రి హరీశ్‌రావు బుధవారం భాస్కర్‌రెడ్డిని పరామర్శించి ధైర్యం చెప్పారు.

వైభవంగా వేణుగోపాలస్వామి బ్రహ్మోత్సవాలు


ఆలయంలో ధ్వజారోహణం నిర్వహిస్తున్న వేద పండితులు

వర్గల్, మే 22 : మండల కేంద్రంలోని పురాతనమైన శ్రీ వేణుగోపాలస్వామి ఆలయంలో స్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా సాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా బుధవారం ఆలయంలో వేదపండితుడు వేదాంతం మురళీధర చార్యుల నేతృత్వంలో ధ్వజారోహణం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో గరుడ కల్యాణం, అగ్ని ప్రతిష్ఠ, సుదర్శన హోమం నిర్వహించారు. సాయంత్రం బేరిపూజ, దేవతాహ్వానంతో తదితర ప్రత్యేక పూజా కార్యక్రమాలు జరిగాయి. వేడుకలను తిలకించడానికి భక్తులు భారీగా తరలివచ్చారు. వేడుకల సందర్భంగా ఆలయ పరిసరాలు భక్తులతో కిటకిటలాడాయి.

భక్తుల కొంగుబంగారం రేణుకాఎల్లమ్మ

● నేటి నుంచి నెల రోజులపాటు జాతర

హుస్నాబాద్. మే 22: భక్తుల పాలిట కొంగుబంగారమైన హుస్నాబాద్ రేణుకా ఎల్లమ్మ జాతర గురువారం నుంచి ప్రారంభం కానున్నది. వందల ఏళ్ల చరిత్ర కలిగిన ఈ ఆలయం రాష్ట్రంలోనే అత్యంత పురాతన ఆలయం. హుస్నాబాద్ రేణుకా ఎల్లమ్మ విగ్రహం దాదాపు 20 అడుగుల ఎత్తులో గంభీరంగా ఉంటుంది. కాకతీయుల కాలంలో రుద్రమదేవి ఇక్కడ చెరువు నిర్మించినప్పుడు ఈ ఎల్లమ్మగుడిని నిర్మించినట్లు చెబుతారు. బమ్మెర పోతన్న, సర్వాయి పాపన్నలాంటి ఎందరో మహనీయులు దర్శించినట్లు చరిత్రకారులు చెబుతారు. ఏటా వైశాఖ పౌర్ణమి నుంచి ఈ జాతర ప్రారంభమై నెల రోజుల పాటు జరుగుతుంది. నెల రోజుల కాలంలో లక్షలాది మంది భక్తులు పిల్ల పాపలతో వచ్చి అమ్మవారిని దర్శించుకుని మొక్కులు సమర్పించుకుంటారు. జాతరకు హుస్నాబాద్ చుట్టు ప్రక్కల గ్రామాల నుంచే కాకుండా మహారాష్ట్రలోని చంద్రాపూర్, షోలాపూర్, బీదర్, హైదరాబాద్, నిజామాబాద్, జనగామ, మెదక్, సంగారెడ్డి, వరంగల్, కరీంనగర్, జగిత్యాల,పెద్దపల్లి, భువనగిరి జిల్లాల నుంచి వేలాది మంది భక్తులు హాజరై మొక్కులు సమర్పించుకుంటారు. గండాలు తొలగాలని గండ దీపం వెలిగించి, కుంకుమార్చనలు చేస్తారు. ప్రతి ఆది, మంగళవారాల్లో మాత్రం ఎక్కువ సంఖ్యలో భక్తులు మొక్కులు సమర్పించుకుంటారు. కాగా ఎల్లమ్మ జాతరకు వచ్చే భక్తుల కోసం ఆలయ కమిటీ అన్నీ ఏర్పాట్లు చేసింది. మూత్ర శాలలు, మంచినీటి సౌకర్యం, భక్తుల విడిది కోసం గదులు వంటి సౌకర్యాలను ఏర్పాటు చేశారు. ఆలయ అనవేటి మండప నిర్మాణం జరుగుతుండటంతో ప్రస్తుతం తడకలతో షెడ్డు వేశార


ఆలయాన్ని విద్యుత్ లైట్లతో అలంకరించిన దృశ్యం, ఆలయంలో కొలువైన రేణుకాఎల్లమ్మ

జాతర కార్యక్రమాలు ఇలా..

ఈ నెల 23వ తేదీన రేణుకా ఎల్లమ్మ జాతర ప్రారంభమై జూన్ 22వ తేదీన ముగుస్తుంది. గురువారం గణపతి పూజ, పుణ్యాహవచనం, దృష్టి కుంభం, అమ్మవారి కల్యాణ మహోత్సవం, సిద్దోగం, బండ్లు తిరిగే కార్యక్రమాలుంటాయి. ప్రతీ మంగళ, శుక్ర, ఆదివారాల్లో విశేష పూజలుంటాయి. ప్రతి రోజూ కుంకుమార్చనలు, ఓడివాల బియ్యం, బోనాలు, పట్నాలు తదితర ప్రత్యేక కార్యక్రమాలుంటాయి. జూన్ 22 తేదీన జాతర ముగుస్తుంది.

పెద్దరాజుపేటలో పీడీఎస్ బియ్యం పట్టివేత

చేర్యాల, మే 22: మండలంలోని పెద్దరాజుపేట గ్రామంలో డీసీఎంలో తరలిస్తున్న 41క్వింటాళ్ల పీడీఎస్ బియ్యాన్ని పోలీసులు పట్టుకున్నారు. పెద్దరాజుపేటకు చెందిన నూనె వెంకటేశ్ తక్కువధరకు పీడీఎస్ బియ్యాన్ని కొనుగోలు చేసి అధిక ధరకు విక్రయించేందుకు మంగళవారం రాత్రి డీసీఎంలో తరలిస్తుండగా చేర్యాల సీఐ శ్రీనివాస్ సిబ్బందితో కలిసి దాడి చేసి సీజ్ చేశారు. వెంకటేశ్‌పై కేసు నమోదు చేసి, పట్టుబడిన బియ్యాన్ని సివిల్‌సప్లై అధికారులకు అప్పగించినట్లు సీఐ తెలిపారు.


నిందితుడితో పాటు పీడీఎస్ బియ్యాన్ని అదుపులోకి తీసుకున్న సీఐ శ్రీనివాస్

బోర్ కేబుల్ వైర్లు చోరీ

ములుగు, మే 22: బోర్ మోటార్ కేబుల్ చోరీ ఘటన మండలం అన్నసాగర్ గ్రామంలో మంగళవారం రాత్రి చోటు చేసుకున్నది. బుధవారం ఈ విషయాన్ని పోలీసులకు సమాచారం ఇవ్వడంతో పోలీసులు రాలేకపోయారు. ఈ సందర్భంగా రిటైర్డ్ లెక్చరర్ కందాడి కృష్ణారెడ్డి స్థానిక విలేకరులతో మాట్లాడుతూ.. గ్రామంలోని పలువురు రైతుల పొలాల వద్ద నుంచి కేబుల్ వైర్ దొంగతనం జరిగిందన్నారు. గ్రామంలోని కాందాడి పోచిరెడ్డి కేబుల్ వైర్, ట్రాక్టర్ బ్యాటరీ, సాకలి కృష్ణ పంప్ సెట్‌కేబుల్ వైర్, రఘుపతిరెడ్డి సిమెంట్ పోల్స్ పైపులను గుర్తుతెలియని దొంగలు కోసుకెళ్లినట్లు ఆయన తెలిపారు. పోలీసులకు ఫోన్ ద్వారా సమాచారమిచ్చినా వారు స్పందించలేదని తెలిపారు.

ట్రాఫిక్ నియమాలను పాటించాలి



ప్రజ్ఞాపూర్ రాజీవ్ రహదారిపై అవగాహన కల్పిస్తున్న ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్

గజ్వేల్, మే 22: ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నియమాలను పాటించాలని గజ్వేల్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ ఎస్.మురళీ పేర్కొన్నారు. గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీలోని ప్రజ్ఞాపూర్ చౌరస్తాలో ప్రజలకు ట్రాఫిక్ నియమ, నిబంధనలపై అవగాహన కల్పించారు. ఆయనవెంట ట్రాఫిక్ సిబ్బంది ఉన్నారు.

అక్రమ నిర్మాణాలకు కౌన్సిలర్ల అండ

హుస్నాబాద్, మే 22: హుస్నాబాద్ మున్సిపాలిటీలో కొందరి కౌన్సిలర్ల అండతో భవన అక్రమ నిర్మాణాలు జరుగుతున్నాయని భారతీయ కిసాన్ సంఘ్ జిల్లా ఉపాధ్యక్షుడు కవ్వ వేణుగోపాల్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. కొందరు కౌన్సిలర్లు, వారి భర్తలు డబ్బు తీసుకుంటూ పర్మిషన్ లేకుండానే భవన నిర్మాణాలు చేయిస్తున్నారని, దీంతో ప్రభుత్వ ఆదాయానికి గండిపడుతుందని ఆరోపించారు. రోడ్డును ఆక్రమిస్తూ నిర్మాణాలు చేస్తున్నా మున్సిపల్ టీపీఎస్ అధికారులు తమకేమీ పట్టనట్లు వ్యవహరిస్తున్నారన్నారు. దీనిపై విచారణ జరిపించి అక్రమ నిర్మాణాలు చేస్తున్నవారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

ఆదర్శ పాఠశాల పనులు పూర్తి చేయాలి


గజ్వేల్-ప్రజ్ఞాపూర్ పరిధిలోని పాఠశాలలో పనులను పరిశీలిస్తున్న కమిషనర్

గజ్వేల్, మే 22: అమ్మ ఆదర్శ పాఠశాల కార్యక్రమం పనులు పూర్తి చేయాలని గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపల్ కమిషనర్ గోల్కొండ నర్సయ్య అన్నారు. గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని సంగుపల్లి, సంగాపూర్, లింగరాజ్‌పేటలోని పాఠశాలల్లో జరుగుతున్న పనులను బుధవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అమ్మ ఆదర్శ పాఠశాలల్లో భాగంగా జరుగుతున్న ఎలక్ట్రిసిటీ, మంచినీటి సరఫరా, మరుగుదొడ్ల మరమ్మతులు, ఇతర పనులను గూర్చి అడిగి తెలుసుకున్నారు. పనులను త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. వెంట మున్సిపల్ ఏఈఈ కిష్టయ్య తదితరులున్నారు.

దొమ్మాటలో పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం


పాఠశాల ఆవరణలో సమావేశమైన పూర్వ విద్యార్థులు

దౌల్తాబాద్, మే 22: దౌల్తాబాద్ పరిధిలోని దొమ్మాట జిల్లా పరిషత్ పాఠశాల ఎస్సెస్సీ 2005-06 బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థుల ఆత్మీయం సమ్మేళనం బుధవారం ఘనంగా నిర్వహించుకున్నారు. సుదీర్ఘకాలం తర్వాత కలుసుకున్న పూర్వ విద్యార్థులు గత స్మృతులను నెమరు వేసుకుంటూ, పరస్పర యోగక్షేమాలను పంచుకున్నారు. రోజంతా ఆటపాటలతో సందడి చేశారు. తమకు విద్యాబుద్ధులు చెప్పిన గురువులను సన్మానించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు, సింహచలం, కొమ్ము పరుశురాం, బండి జోసెఫ్, కరుణాకర్, గురునానక్, ఖాదర్, ప్రవీణ్, స్టేవెన్, మమత, హరిత, సనీత, సంగీత, ప్రవీణ్ పాల్గొన్నారు.

భూసార పరీక్షలు విధిగా చేసుకోవాలి

చేర్యాల, మే 22 : రైతులు తమ పంటపొలాలలో భూసార పరీక్షలు విధిగా చేయించుకోవాలని, నేల ఆరోగ్యాన్ని కాపాడి అధిక దిగుబడులు పొందవచ్చని మన గ్రోమోర్ సెంటర్ జోనల్ మార్కెటింగ్ మేనేజర్ రాజ్‌కుమార్ అన్నారు. ఆకునూరు గ్రామంలో బుధవారం రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. అనంతరం రైతులు తెచ్చిన మట్టి నమూనాలు పరీక్షించి నివేదికలు అందించారు. కార్యక్రమంలో ఏరియా ఆపరేషన్ మేనేజర్ సురేశ్, మార్కెటింగ్ మేనేజర్ జానకయ్య, చేర్యాల మేనేజర్ మదుసూధన్ తదితరులు పాల్గొన్నారు.

అన్ని రకాల వడ్లకు బోనస్‌ను అందించాలి

మిరుదొడ్డి, మే 22:రాష్ట్ర ప్రభుత్వం అన్ని రకాల వడ్లకు బోనస్ ఇవ్వాలని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు తోటకమలాకర్‌రెడ్డి, మిరుదొడ్డి ఎంపీపీ ఉపాధ్యక్షుడు పోలీస్ రాజులు డిమాండ్ చేశారు. బుధవారం ప్రభుత్వం సన్నాలకు కాకుండా అన్ని రకాల వడ్లకు 500 బోనస్ ఇవ్వాలంటూ మిరుదొడ్డిలో బీఆర్‌ఎస్ నాయకులు నిరసన వ్యక్తంచేడయంతోపాటు తహసీల్దార్ గోవర్ధన్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. అలాగే తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వమే కొనుగోలు చేయాలన్నారు. లేనిపక్షంలో బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో పెద్దఎత్తున ఆందోళన కార్యక్రమాలను చేపడుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు తోట అంజిరెడ్డి, మాజీ సర్పంచుల ఫోరం అధ్యక్షుడు బాల్‌రాజు, నాయకులు లింగం, సత్యనారాయణ, మల్లేశం, రాములు తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌తోనే పట్టభద్రులకు న్యాయం

చేర్యాల, మే 22 : నిరుద్యోగ నిర్మూలనకు చిత్తశుద్ధితో పాటుపడిన బీఆర్‌ఎస్‌తోనే పట్టభద్రులకు న్యాయం చేకూరుతుందని, వరంగల్, ఖమ్మం, నల్లగొండ జిల్లాలగ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికలలో బీఆర్‌ఎస్ అభ్యర్థి రాకేశ్‌రెడ్డిని గెలిపించాలని బీఆర్‌ఎస్వీ రాష్ట్ర కార్యదర్శి జింకల పర్వతాలు యాదవ్ కోరారు. చేర్యాల మండలం పోతిరెడ్డిపల్లి గ్రామంలో బుధవారం ఆయన పట్టభద్రులను కలిసి ప్రచారం నిర్వహించారు. విద్యావంతుడు, ఆదర్శ భావాలు కలిగిన బీఆర్ఎస్ అభ్యర్థి ఏనుగుల రాకేశ్‌రెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరారు.

కాంగ్రెస్ ఆధ్వర్యంలో ప్రచారం

కాంగ్రెస్ అభ్యర్థి తీన్మార్ మల్లన్న తరుపున బుధవారం చేర్యాల పట్టణంలో కాంగ్రెస్ నాయకులు ప్రచారం చేశారు. మాజీ జడ్పీటీసీ కొమ్ము నర్సింగరావు, కౌన్సిలర్ ఆడెపు నరేందర్, పట్టణాధ్యక్షుడు మంచాల చిరంజీవులు తదితర నాయకులు పట్టణంలోని పట్టభద్రులను కలిసి ప్రచారం చేశారు. కొమురవెల్లి మండలం తపాస్‌పల్లి గ్రామంలో కాంగ్రెస్ మండలాధ్యక్షుడు మహదేవుని శ్రీనివాస్, యూత్ కాంగ్రెస్ మండలాధ్యక్షుడు లింగంపల్లి శ్రీనివాస్, నాయకులు పుట్ట రమేశ్, కంకనాల ప్రవీణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.